



జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద జనం (ఫైల్ ఫొటో)



అహుడా అడగదా..?

చిలమత్తూరు మండలం అహుడా పరిధిలో అక్రమ లేఅవుట్‌ల వ్యవహారం తారా స్థాయికి చేరింది. ఏ మాత్రం అనుమతులు లేకుండానే లేఅవుట్‌లు వేసి రియల్టర్లు విక్రయాలు చేస్తున్నారు. నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా అమాయక ప్రజలను మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లేఅవుట్లు వేసే వారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇక అహుడా కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో అక్రమ లేఅవుట్లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

- చిలమత్తూరులో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్‌లు
- అనుమతులుండవు.. నిబంధనలు పాటించరు..!
- కన్వర్షన్‌ల ఊసేలేదు..

ప్రజాశక్తి-చిలమత్తూరు

నిబంధనల ప్రకారం లే అవుట్ వేయాలంటే పంచాయతీ అధికారి అనుమతి పొందాలి. అనంతరం అహుడా అనుమతులు ఇవ్వాలి. లేఅవుట్ అభివృద్ధి ఎలా చేస్తారు.. ఎంత శాతం భూమిని మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు.. తదితర వివరాలను అహుడాకు సమర్పించాల్సి ఉంది. వ్యవసాయ భూమిలో లేఅవుట్ వేస్తే దానిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయాల్సి ఉంటుంది. కమర్షియల్ భూమిగా మార్చిన తర్వతే లే అవుట్ వేయాలి. చిలమత్తూరు మండలం కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలో వేస్తున్న లేఅవుట్‌లో మచ్చుకైనా ఇవి కన్పించుకున్నా వెంచర్లు మాత్రం పుట్టుకొస్తున్నాయి.

భూమి చదును అంటూ అనుమతులు

కమర్షియల్‌గా మట్టిని వాడుకోవాలంటే మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారుల అనుమతి తీసుకోవాలి. వారి అనుమతి అనంతరం తవ్వుతున్న భూమి కొలతలను బట్టి ప్రభుత్వానికి సుంకం చెల్లించాల్సి ఉంటుంది. కోడూరు పరిధిలో వేస్తున్న లేవుట్‌లలో ఇలాంటి నిబంధనలు ఏమి పాటించడం లేదు. భూమి చదును పేరుతో వ్యవసాయ భూమిలో వందల ట్రాక్టర్ల మట్టిని చెరువులు, లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల నుంచి తీసుకొచ్చేస్తున్నారు. ఈ మట్టితో లేఅవుట్‌లను చదును చేసుకుంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయానికి గండి కొడుతున్నారు. కళ్లేదుటే నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎవరైనా దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్తే వన్-బిలో వ్యవసాయ భూమిగా ఉందని, వ్యవసాయ అవసరాల నిమిత్తం పొలాన్ని చదును చేసుకుంటున్నారమోనని తాము అనుకున్నామని అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అహుడా అనుమతులు నిల్

చిలమత్తూరు మండలం అహుడా పరిధిలోకి వస్తుంది. అహుడా పరిధిలో ఉన్నా అందుకు సంబంధించిన నిబంధనలేవీ లేఅవుట్‌ల విషయంలో అమలు కావడం లేదు. పెద్దపెద్ద ప్రొక్లైనర్లతో భూములను చదును చేస్తున్నారు. ప్రయివేటు సర్వేయర్‌లతో ప్లాట్లు వేయిస్తున్నారు. ప్రభుత్వ భూముల నుంచి తీసుకొచ్చిన మట్టితో లేఅవుట్లలో రోడ్లు వేస్తారు. హద్దు రాళ్లకు రంగురంగుల కలర్లు వేస్తారు. పెద్దపెద్ద చెట్లు నాటి త్రీడీలో స్కెచ్‌లు వేస్తారు. బెంగుళూరు ఎయిర్ పోర్ట్, లేపాక్షి నంది, వీరాపురం బర్డ్స్ కేంద్రం, ప్రశాంతి నిలయం, బెంగుళూరు హైవే అంటూ ప్రకటన పత్రాలు తయారు చేస్తారు. అందమైన డిజైన్లతో వెంచర్‌ను ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తారు. ఇదంతా అహుడా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా ఆ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

కోడూరు పంచాయతీలో అధికం

కోడూరు పంచాయతీ కోడూరు రెవెన్యూ పొలం అధికంగా బెంగుళూరు జాతీయ రహదారికి అనుకుని ఉంది. ఆ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్‌లకు మంచి గిరాకి ఉండడంతో అక్రమ లేఅవుట్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ పద్ధతుల్లో లేవుట్‌లు వేసి రియల్టర్లు జేబులు నింపుకుంటున్నారు. నిబంధనలను తుగ్గలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ విచ్చలవిడిగా వేస్తున్న అక్రమ లేఅవుట్లపై సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు గాలికి..!

మొరంపల్లిలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. కనిశెట్టిపల్లి సమీపంలో సర్వే నంబర్ 417, మొరంపల్లిలో 751- 2ఏ6, 751-2ఏ7, సర్వేనెంబర్‌లో ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ అధికారులను ప్రజాశక్తి వివరణ కోరగా లేవుట్‌ల నిర్మాణానికి తాము అనుమతి ఇవ్వలేదని వారు చెబుతున్నారు. అహుడా అనుమతి కూడా లేదు. అయినా యథేచ్ఛగా లేఅవుట్‌లు ప్లాట్లుగా వేసి విక్రయించే ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. కోడూరు పంచాయతీ కోడూరు రెవెన్యూ పొలం అధికంగా బెంగుళూరు జాతీయ రహదారికి అనుకుని ఉంది. ఆ రహదారికి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్‌లకు మంచి గిరాకి ఉండడంతో అక్రమ లేఅవుట్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ పద్ధతుల్లో లేవుట్‌లు వేసి రియల్టర్లు జేబులు నింపుకుంటున్నారు. నిబంధనలను తుగ్గలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ విచ్చలవిడిగా వేస్తున్న అక్రమ లేఅవుట్లపై సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణకురాని పైలెట్ ..!

ముందుకు సాగని హెలికాప్టర్ కేసు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా వైఫల్యంపై పోలీసు అధికారుల విచారణ కొనసాగుతోంది. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామ పర్యటనకు గత నెలలో జగన్మోహన్ రెడ్డి విచ్చేశారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఇక్కడికి విచ్చేసిన సమయంలో పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు నాయకులు ఆయన దిగిన హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింది. ఆయనను తిరుగు ప్రయాణంలో తీసుకెళ్లలేమని హెలికాప్టర్ సిబ్బంది తిరస్కరించారు. జగన్మోహన్ రెడ్డిని వెంట తీసుకెళ్లకుండానే హెలికాప్టర్ తిరిగి వెళ్లింది. దీంతో ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరు వెళ్లారు. భద్రత వైఫల్యంతోనే హెలికాప్టర్ నష్టం జరిగిందని వైసిపి నాయకులు ఆరోపించారు. ఈ ఆరోపణ నేపథ్యంలో పోలీసులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టారు. జగన్‌మోహన్ రెడ్డి పర్యటన రోజు హెలికాప్టర్‌కు ఎటువంటి ప్రమాదం జరిగిందన్న దానిపై ఆరా తీసే పని చేపట్టారు. గత నెల 16వ తేదీన విచారణ హాజరు కావాలని పైలట్, కో పైలట్లకు నోటీసులు ఇచ్చారు. విచారణకు 16వ తేదీన కోపైలట్ ఆయన న్యాయవాదితో కలిసి చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హాజరై తమ వాదనలను వినిపించారు. మాండేటరీ లీవ్‌లో ఉన్నందున అనిల్ కుమార్ రాలేకపోయినట్టు ఆ రోజు పోలీస్ అధికారులకు తెలిపారు. మరో తేదీన హాజరుకావాలని పైలెట్ అనిల్ కుమార్‌కు సత్యసాయి జిల్లా పోలీసులు నోటీసు ఇచ్చారు. మే ఒకటి, రెండు తేదీల్లో హాజరై హెలికాప్టర్ సంబంధించిన ఇబ్బందులపై వివరణ ఇవాల్సి ఉంది. అయితే అనిల్ కుమార్ ఒకటి, రెండు తేదీల్లో కూడా విచారణకు హాజరవలేదు. ఆయన హాజరుకాని నేపథ్యంలో తదుపరి చర్యలకు పోలీసులు సమాయత్తమవుతున్నట్టు సమాచారం. పైలెట్ అనిల్ కుమార్ వివరణతోనే జగన్మోహన్ రెడ్డి పర్యటనలో ఏం జరిగిందన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశాలు న్నాయి. కో పైలెట్ ఇచ్చిన వివరణలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిన్న టేక్ ఆఫ్ చెయ్యొచ్చు అన్న నిర్ణయం తీసుకోగలిగేది పైలెట్ చేతిలోనే ఉంటుందని చెప్పినట్టు సమాచారం. పైలెట్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని హెలికాప్టర్లో తీసుకెళ్లడానికి నిరాకరించి తర్వాత ఏ రకంగా టేక్ ఆఫ్ చేసుకుని వెళ్లారన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికీ పోలీసులు అటు హెలికాప్టర్ సంస్థకు దానిని బుక్ చేసిన ట్రావెల్ ఏజెన్సీకి నోటీసులు ఇచ్చారు. వీరందరి వివరణ తర్వాత ఆరోజు పర్యటనలో ఎవరి లోపాలున్నాయని తేలనుంది.

వైసిపిని వెంటాడుతున్న కేసులు

వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద జరిగిన విషయంలో నిర్వాహకులైన రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు అయ్యింది. గత నెల పదవ తేదీన ఆయనపై కేసు నమోదు చేశారు. ఒకవైపు హెలికాప్టర్ సిబ్బందిపై విచారణ చేపడుతూనే మరోవైపు ఈ కార్యక్రమం నిర్వాహకులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ విషయంలో ముందస్తు బెయిల్ కోసం ప్రకాష్ రెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బెయిల్ లభించకపోవడంతో ఆయన అజ్ఞాతంలో వెళ్లారు. ఇదే సమయంలో ప్రకాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.



అనంతపురం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు, ముస్లిములు

ఉగ్రదాడిని నిరసిస్తూ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం నగరంలోని 4వ రోడ్డులోని చాందిని మసీద్ నుంచి ముస్లిములు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నడిమివంక వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ రోడ్డు మసీదు పెద్ద మునీర్ బాషా, హారన్ సాబ్ రసీద్, షబ్బీర్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ప్రకాష్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలీ, ఇస్మాయిల్, దాదు, అజాది మసూద్, గరీబ్ ది ట్రస్ట్ జిలాన్, ఇన్సాఫ్ జిల్లా నాయకులు గోల్డ్ బాషా మాట్లాడుతూ ఉగ్రవాదం, మతోన్మాదం రెండు దేశ ఐక్యతను దెబ్బతీస్తుందని కావున ఉగ్రవాదాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి ప్రతి ఒక్కరం సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, ఐఎంఎం బాషా, జాకీర్, మానవ హక్కుల జాకీర్ సాహెబ్, నిస్సార్, మైనార్టీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రామానుజాచార్యుల జయంత్యుత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవైష్ణవ సమాజం ఆధ్వర్యంలో రామానుజాచార్యుల 1008వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు ఎపి.శ్రీధర్, కార్యదర్శి దేవరెడ్డిపల్లి రాజేష్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యశర్మ, సింహాద్రి, ఆనంద్, సంతోష్, సత్యనా రాయణ, యాదవ సంఘం అధ్యక్షులు బంగి ఉమాశంకర్, కార్యదర్శి బాబు, వైస్ ప్రెసిడెంట్ తిమ్మరాజులు, కోశాధికారి నాగరాజు, మద్దిలేటి ప్రభాకర్, శ్రీవైష్ణవ సమాజ బాంధవులు పాల్గొన్నారు.

శంకర జయంతి

పట్టణంలోని కోటలో ఉన్న శారద శంకర మఠంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. వినాయక కూడలి వరకూ శోభాయాత్ర నిర్వహించారు. రాజ ఆశ్రమంలో పీఠాధిపతి వాసుదేవానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో శంకరాచార్యుల జయంతి ఉత్సవం నిర్వహించారు.

ఆర్‌డిటిని కాపాడుకుందాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

'ఆర్‌డిటిని కాపాడుకుందాం' అని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. 'సేవ్ ఆర్‌డిటి-సేవ్ అనంతపురం'పేరుతో శుక్రవారం బ్రహ్మసముద్రంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరప్ప, ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం తహశీల్దార్ సుమతికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి తక్షణమే ఆర్‌డికి సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, మహదేవప్ప, సర్పంచులు గోవిందప్ప, ఎల్లప్ప, గంగాధర్, వైస్ ఎంపిపి బాదపల్లెప్ప, ఎంపిటిసిలు రామ్మోహన్, నాగలక్ష్మి, బుశప్ప, శివన్న, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దారెడ్డిని అడుగు పెట్టనివ్వం : జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలం ప్రశాంతంగా ఉండాలంటే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇక్కడికి రాకూడదని, అందుకోసం ఆయన్ను తాము రానివ్వబోమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. పెద్దవడుగూరుకు శుక్రవారం విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కక్షలు రేగకుండా ఉండాలంటే పెద్దారెడ్డి లాంటి వ్యక్తులు ఇక్కడికి రాకూడదన్నారు. వైసిపి నాయకులు కూడా ఆయన్ను పిలుచుకోవద్దని సూచించారు. పెద్దవడుగూరును అభివృద్ధి చేయాలనే తపనతో ఉన్నానని జెసి స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో పెద్దారెడ్డిని పెద్దవడుగూరుకు రప్పించి మళ్లీ కక్షలు రేపొద్దని స్థానిక వైసిపి నాయకులను కోరారు. పెద్దవడుగూరు బాగుండాలంటే పెద్దారెడ్డి ఇక్కడకు రాకూడదని, ఇందులో ఎలాంటి రాజకీయాలూ లేవన్నారు.

ప్రజలకు చేరువగా గ్రంథాలయాల సేవలు

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గ్రంథాలయాల సేవలను భవిష్యత్తు తరాలకు మరింత చేరువ చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి పర్సన్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. శుక్రవారం అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో గ్రంథాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అధికారులు అందరూ నిర్ణీత సమయంలో గ్రంథాలయాలను తెరిచి ఉంచాలన్నారు. గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయ పన్నుల మీద ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సంబంధించిన పంచాయతీ, మున్సిపాలిటీల నుంచి నిర్ణీత సమయంలో వసూలు చేయాలని ఆదేశించారు. గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరముల గురించి పాఠకులకు అవగాహన కల్పించి, చదువుతున్న పిల్లలకు చక్కటి నైపుణ్యాలను కల్పించాలని సూచించారు. గ్రంథాలయాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల ముందుకు కార్మికుల సమస్యలు

జాయింట్ మీటింగ్‌లో చర్చ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



మున్సిపల్ కార్మికులతో చర్చలు జరుపుతున్న కమిషనర్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలపై కమిషనర్ బాలస్వామి ఛాంబర్‌లో శుక్రవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నాయకులతో అధికారుల జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు కార్మిక సమస్యలపై కార్మిక సంఘం నాయకులు ప్రస్తావించారు. ముఖ్యంగా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకం కల్పించాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, అదనపు కార్మికులకు రూ.15వేల వేతనం పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, టెక్నికల్ సమస్యలతో వేతనాలు పడని వారికి వేతనాలు ఇప్పించాలని కోరారు. అలాగే పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవు, పెండింగ్‌లో ఉన్న డిఎలు మంజూరు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు 2011లో 9 నెలల ఇపిఎఫ్ బకాయి చెల్లించాలని, డెత్ క్లెయిమ్స్ చేయాలని, కార్మికులందరికీ గ్రూప్ బీమా కల్పించాలని, ఎన్ఎంఆర్ కార్మికులకు డిఎ, చనిపోయిన ఎన్ఎంఆర్ కార్మికులకు కారుణ్య నియామకం కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరారు. వీటితో పాటు పనిముట్లు, మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కమిషనర్ ఆయా సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ పావని, ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ సుజాత, సిఐటియు నగర కార్యదర్శులు వెంకట్‌నారాయణ, ముత్తుజ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎస్.నాగరాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీనారాయణ, పర్మినెంట్ కార్మికుల అధ్యక్షులు ముత్తురాజు, ఇంజినీరింగ్ విభాగం జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, నగర అధ్యక్షులు మురళి, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేయాలి

జెడిఎకు రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జెడిఎకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

జిల్లాలోని రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం ఆధ్వర్యంలో అనంతపురంలోని కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ సాగు అంచనా 3,43,232 హెక్టార్లలో సాగు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. వేరుశనగ పంట 1.82 లక్షల హెక్టార్లలో సాగవుతుందని తక్కువగా అంచనా వేసి ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తన వేరుశనగ కేటాయింపులు తగ్గించడం అన్యాయంగా ఉందన్నారు. కావున విత్తన కేటాయింపులు పెంచి 90 శాతం సబ్సిడీతో వేరుశనగ, కందులు, ఉలవ ఇతర ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఎరువులు పురుగుమందులు రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరాకు 3 బస్తాల చొప్పున 5 ఎకరాలకు ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర విత్తనాలు, ఎరువులు పురుగు మందులు రైతు సేవ కేంద్రాల ద్వారా సబ్సిడీతో ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేల వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే సమగ్ర ఉచిత పంటల బీమా ప్రకటించి అమలు చేయాలన్నారు. నాసిరకం, కల్తీ విత్తనాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, బి.చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప

కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని సిద్దేశ్వరకాలనీలో బయలు ఆంజనేయస్వామి ఆలయం వద్ద వర్షం నీటి కాలువలో పూడిక తొలగింపు పనులకు శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పూజ చేసి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 20 లక్షల వ్యయంతో పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో కాలువల్లో నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈలు ప్రతాప్, నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు నజీర్, వైసిపి నాయకులు దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడడానికి ప్రభుత్వం 50 శాతం రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేస్తుందని పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 20 నుంచి 25 టన్నుల పశువుల దాణా కేటాయించారన్నారు. తెల్ల రేషన్ కార్డ్ కలిగిన పాడి రైతులకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఒక పాడి రైతుకు ఒక బ్యాగ్(50 కిలో) మాత్రమే ఇస్తారు. భారత్ పశుధాన్ యాప్‌లో యజమాని పేరుపై పశువు కమ్మ లేదా ట్యాగ్ నెంబర్ నమోదై ఉండాలి. యాప్‌లో నమోదైన పశువుకు టీకా వేయించి ఉండాలి. పశుబీమా పథకం కింద పాడిపశువులకు ఇన్సూరెన్స్ చేయించుకున్నా ప్రాధాన్యత ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రం, పశు వైద్యశాలలో పేర్లు నమోదు చేయించి రైతు వాటా చెల్లించాలన్నారు.

కిశోరి వికాసంతో బాలికలకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కిశోరి వికాసంతో బాలికలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని సూపర్వైజర్లు ఖాసింబీ, రామాం జనమ్మ సూచించారు. మండలంలోని బ్రహ్మసముద్రం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉజ్వల, ఆరోగ్యకరమైన భవిష్యత్తు, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టిగా చేయూతనిద్దామన్నారు. కిశోరి వికాసం కార్యక్రమాలు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. 11-18 ఏళ్ల బాలికలకు చదువు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శారీరక, మానసిక ఆరోగ్యం, ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా, సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా చేయూతనిస్తారన్నారు.



కిశోరి వికాసం కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్లు

జెఎన్‌టియుతో 'స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషన్' అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-అనంతపురం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

హైదరాబాదుకు చెందిన ఎంఎస్ స్మార్ట్ బ్రిడ్జి ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీతో అనంతపురం జెఎన్‌టియు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విసి హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ జెఎన్‌టియు అనుబంధ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఈ ఒప్పందం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకుని ప్రస్తుత టెక్నాలజీ కి సంబంధించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, డిఎపి ఎస్‌వి సత్యనారాయణ, సి.శోభాబిందు, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎంఎస్ స్మార్ట్ బ్రిడ్జి ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు శ్రీదేవి, సిరా, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్మా కళాశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ఆర్ఐఒ వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్లాస్మా కళాశాల అనుమతి రాకపోయిన అకాడమీ పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్లాస్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ఐఒ వెంకట రమణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం నగరంలోని రెండవ రోడ్డులో ఉన్న ప్లాస్మా అకాడమీ యాజమాన్యం ప్లాస్మా కళాశాల పేరుతో లక్షల రూపాయలు దండుకుంటోందన్నారు. జిల్లావ్యాప్తంగా ఏ ప్రయివేట్, కార్పొరేట్ కళాశాల కూడా అధిక ఫీజులు వసూలు చేశారన్నారు. ఇప్పటికే ప్లాస్మా కళాశాల అనుమతి ఆర్ఐఒ ఇచ్చారంటూ చెబుతూ ప్రత్యేక భవనం, ఏసి గదులు, మౌళిక వసతులు ఉన్నాయంటూ గతంలో వచ్చిన ర్యాంకులను వలగా వేసి ఒక విద్యార్థి నుంచి రూ.2 లక్షలు వరకు వసూలు చేసే ప్రయత్నం ప్లాస్మా అకాడమీ కళాశాల పేరుతో మోసం చేస్తున్నారని తెలిపారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, నగర నాయకులు విజయ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ ఎస్ఇగా రామ్మోహన్‌రెడ్డి



అనంతపురం : ప్రజా ఆరోగ్యశాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇన్‌ఛార్జి ఎస్ఇగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎస్ఇగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన తాడిపత్రి కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం క్రైం : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ5 ఎఇ మునిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా నారాయణపురం, తపోవనం, ఇందిరమ్మ కాలనీ, బళ్లారి రోడ్, నందమూరి నగర్, ద్వారకా విల్లాస్, స్టాలిన్ నగర్, ప్రియాంక నగర్, కళ్యాణదుర్గం మెయిన్ రోడ్, శాంతి నగర్, జొన్నా ఐరన్ మార్ట్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పాపంపేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఐద్వా నాయకురాలు అరుణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


అరుణకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ఆంధ్రప్రదేశ్ కమిటీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారిగా విశిష్ట సేవలు అందించిన సి.అరుణ మృతి మహిళా లోకానికి తీరని లోటు అని ఐద్వా నేతలు అన్నారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో అరుణ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రసూన, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ జిల్లాలో ఐద్వా సంస్థాపకుల్లో అరుణ ఒకరన్నారు. ఆమె భర్త సాంబిరెడ్డి లెక్చరర్‌గా పని చేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులుగా వెళ్లినప్పుడు అరుణ ఇచ్చిన సహకారం చాలా గొప్పదన్నారు. హైదరాబాదులోనే ఐద్వా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, మహిళలకు కౌన్సిలింగ్ సెంటర్ కూడా నడిపారన్నారు. కార్యకర్తలను అరుణ తన బిడ్డల్లా చూసుకునే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

సచివాలయ ఉద్యోగులతో జెసి ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రతి సచివాలయ ఉద్యోగి పంచాయతీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బారెన్‌సాహెబ్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దవడుగూరు పంచాయతీలో గత టిడిపి హయాంలో రూ.75 లక్షలు నిల్వ ఉండేదని.. ఇందుకు సంబంధించిన లెక్కలతోపాటు తాను ఉచితంగా అందజేసిన వాహనాలు చూపించాలని కార్యదర్శి ఆంజనేయులును కోరగా పంచాయతీలో రూ.8లక్షలు మాత్రమే నిల్వ ఉందని చెప్పడంతో జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన మొత్తం ఎక్కడికి పోయిందో తెలియజేయాలని ఆదేశించారు. కాగా పంచాయతీల్లో ఉన్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన రెవెన్యూ కార్యాలయంలో వెళ్లి కార్యదర్శులు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రెవెన్యూలో రైతులకు సంబంధించిన భూరికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఎపిడి పుల్లారెడ్డి, ఇంజినీర్లు వరప్రసాద్, ఆంజనేయులు, మండల విద్యాధికారి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉన్న మండలంలోని రావులుడికి చెందిన టిడిపి నాయకుడు సోమశేఖరరెడ్డిని జెసి ప్రభాకరరెడ్డి పరామర్శించారు. ఇందులో భాగంగా ప్రమాదం జరిగిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి యువనాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇకెవైసి గడువు పొడిగించాలి

తాడిపత్రి రూరల్ : రేషన్‌కార్డుదారులకు సంబంధించి ఇకెవైసి గడువు పెంచాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో ఇంకా చాలామంది రైతులు, రైతు కూలీలు ఇకెవైసి చేయించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో ఇకెవైసి చేయించుకోని వారికి రేషన్ నిలుపుదల చేస్తే వారంతా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఇకెవైసి చేయించుకునేందుకు గడువు పెంచాలని కోరారు.

వైసిపి ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా కుళ్లాయప్ప

అనంతపురం : అనంతపురం వైసిపి ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా కుళ్లాయప్ప నియమితులయ్యారు. ఇందులో భాగంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన అధినేత జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పేద కుటుంబానికి సరుకులు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధపడుతున్న పెనుగొండ మండలం సోమందేపల్లి గ్రామానికి చెందిన కామాక్షి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందించినట్లు తెలిపారు. ఈ సాయానికి ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు శ్రీనివాసులు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

దాచూరి రామిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య


లింగమయ్యకు నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగ పరిరక్షణకు విశేష కృషి చేసిన పోరాట యోధుడు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) వ్యవస్థాపకుల్లో ఒకరైన దాచూరి రామిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య పిలుపునిచ్చారు. రామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో అమరజీవి ఎమ్మెల్సీ పాత్ర సాటిలేనిదన్నారు. ఆయన జీవితం, వ్యక్తిత్వం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరప్ప, పూర్వ కోశాధికారి రామకృష్ణ, నాయకులు మహమ్మద్ గౌస్, శేషప్ప, రోగప్ప, దస్తగిరి, బాబురావు, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-యాడికి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

రైతులు ప్రభుత్వం అందజేసే సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో యాడికి, పెద్దవడుగూరు మండలా రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ముందుగా గడిచిన రబీ సీజన్‌కు యాడికి ,పెద్దవడుగూరు మండలాలను కరువు మండలాలుగా గుర్తించిన నేపథ్యంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్నట్లు గుత్తి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్రాముడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు ఎరువులు పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్నిరైతు సోదరులందరూ వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాడికి తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిడిఒ వీర్రాజు, ఇఒఆర్‌డి శశికళ, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, వేలూరు రంగయ్య, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసికి పరామర్శ

మండల కేంద్రంలోని కోన రోడ్డులో నివాసం ఉంటున్న మాజీ ఎంపిటిసి దడియాల ఆదిని ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి పరామర్శించారు. ఆది గత మార్చిలో సాయంత్రం వాకింగ్ వెళ్లి వస్తూ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడాడు. ఈనేపథ్యంలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద ఉన్న బాధితుడిని ఎమ్మెల్యే పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, విశ్వనాథ్, గండికోట లక్ష్మణ్, జెసి అభిమాని సెల్ పాయింట్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

యాడికి : మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో సర్పంచు మైల ఓంకారమ్మ, సాంబశివుడు ఆధ్వర్యంలో షబానా ఐ కేర్ తాడిపత్రి వారు శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు జగదీష్ దాదాపు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముల్లారసూల్, షామీర్, చిట్టెంరెడ్డి రంగారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

గవిమఠం పీఠాధిపతికి పరామర్శ

ఉరవకొండ : అనారోగ్యానికి గురైన ఉరవకొండలోని ప్రసిద్ధ గవిమఠం పీఠాధిపతులు, జగద్గురువు చెన్నబసవ రాజేంద్రస్వామిని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇందులో భాగంగా స్వామీజీ ఆరోగ్యం స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఠాధిపతుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి

పెద్దవడుగూరు : ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పెద్దవడుగూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

ప్రజాశక్తి-ఆత్మకూరు


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని అందుకనుగుణంగా ఎరువువాడి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం అధికారి పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ముట్లాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి సుచరిత, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సమక్షంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మట్టి నమూనాలను ఎలా తీయాలి, వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుజాత, సిఇఒ ప్రతిమ, హనుమంతరెడ్డి, ఎఇఒ సుజిత, ఆర్ఎస్‌కె సిబ్బంది అరుణ, ప్రసన్నలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత తాడిపత్రి ఆర్‌డిటి జట్టు

ప్రజాశక్తి-తాడిపత్రి


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి గవర్నమెంట్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ క్యాంప్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి టోర్నమెంట్ విజేతగా తాడిపత్రికి చెందిన ఆర్డీటీ జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో తాడిపత్రి ఆర్డీటీ, ఎడిసిఎ గుంతకల్ జట్టు తలపడగా తాడిపత్రి జట్టు విజయకేతనం ఎగరవేసింది. మొదట ప్రజాశక్తి విలేఖరి వెంకటరామిరెడ్డి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తాడిపత్రి ఆర్డీటీ క్యాంప్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 181 పరుగులు సాధించింది. జట్టులోని వీరారెడ్డి 64 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంతకల్లు జట్టు 20 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌట్ అయింది. విన్నర్‌తోపాటు రన్నరప్ జట్లకు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి బహుమతితోపాటు ట్రోఫీ అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా తాడిపత్రి ఆర్డీటీ జట్టు సభ్యులు బిఎస్ వినయ్ కుమార్ ఎంపికయ్యారు, బెస్ట్ వికెట్ కీపర్‌గా తాడిపత్రి జట్టు నుంచి అరుణ్‌కుమార్ ఎంపికయ్యాడు. బెస్ట్ ఫీల్డర్‌గా ఎడిసిఎ గుంతకల్లు జట్టు నుంచి కామెల్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా తాడిపత్రి జట్టు సుధీర్ ఎంపికయ్యాడు. టోర్నమెంట్ అంపైర్లుగా చెన్నకేశవరెడ్డి, పవన్, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఆర్డీటీ జట్టు కోచ్ భార్గవ్, తాడిపత్రి క్రికెటర్ అసోసియేషన్ సెక్రటరీ సాధిక్‌వలి, ఎసిఎ స్కోరర్ వినయ్, సీనియర్ ప్లేయర్ వెంకట్, లక్ష్మణ్, ఆర్‌డిటి క్యాంప్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజకీయాలు పక్కన పెట్టి ఆర్డీటీని కాపాడుకుందాం

ర్యాలీలో వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాజకీయాలను పక్కన పెట్టి జిల్లాకు వరప్రధానియి అని రూరల్ డెవలప్‌మెంట్ ట్రసు (ఆర్‌డిటి)ని కాపాడుకుందామని ఎంపిపి సుబ్బర హేమలత పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కనకదాసు కల్యాణ మండపం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ మహిళలతో కలిసి 'సేవ్ ఆర్డీటీ–సేవ్ అనంత' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువు కోరల్లో చిక్కుకున్న అనంత జిల్లా పాలిట ఆర్డీటీ వరం అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సేవలు చేస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి విజయ్‌కుమార్‌నాయక్, సర్పంచు ఎగ్గిడి వరలక్ష్మి, వైసిపి చంద్రశేఖర్‌రెడ్డి, వన్నూరప్ప, మాజీ ఎంపిటిసి నరసింహులు, సింగంపల్లి వెంకటేష్, గొరువ రాజశేఖర్, మన్నల పోలన్న, వెంకటేష్, వెంకటరామిరెడ్డి, పోలన్న, మహేష్, పెద్దన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఆర్డిటి సంస్థకు చెందిన ఎఫ్‌సిఆర్ఎ రెన్యూవల్‌ను పునరుద్ధరించాలని వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకుడు డి.హుస్సేన్‌పీరా డిమాండ్ చేశారు. ఆర్డీటీని కాపాడుకుందాం అనే నినాదంతో గుత్తిలో శుక్రవారం వెసిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్అండ్ బి అతిథి గృహం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. తర్వాత ఉప తహశీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివ, రమణ, నాయకులు సివి.రంగారెడ్డి, గురుప్రసాద్ యాదవ్, మల్లయ్యయాదవ్, ఎం.రంగస్వామి, ఎ.దస్తగిరి, కెఎం.రంగనాయకులు, వైపి. బాబు, హరినాథ్‌రెడ్డి, ప్రశాంత్, కటిక మున్వార్, ఖురేష్ అన్వర్, దాదాపీర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఆర్డీటీకి విదేశీ నిధుల పునరుద్ధరణకు కేంద్రం సహకరించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌డిటి కాలనీలోని డాక్టర్ ఫాదర్ ఫెర్రర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సంత మార్కెట్ మీదుగా పోలీస్‌స్టేషన్, అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు టి.ఆదినారాయణ మాదిగ, వై.నర్సాపురం లక్ష్మీదేవి, సింగనగుట్టపల్లి వెంకటరమణ, కొత్తపల్లి పెద్దిరాజు, నర్సాపురం మురళి, తప్పెట పెద్దన్న, ఆది, లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, పెద్దపప్పూరు రత్నమ్మ, సువర్ణ, ఆర్డీటీ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నీలి గిరప్పస్వామి, అయ్యలప్ప స్వాముల ఉత్సవాలు

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని గంజిగుంట గ్రామంలో శుక్రవారం నీలగిరి అప్పస్వామి, అయ్యలప్ప స్వాముల పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కురుబ కులస్తులు, వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్సీ విభాగం కార్యదర్శిగా సాకే రామాంజనేయులు



నార్పల : వైసిపి ఎస్సీ విభాగం కార్యదర్శిగా మండలానికి చెందిన సాకే రామాంజినేయులు నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వైసిపి ఎస్సీ విభాగం కార్యదర్శిగా నియమించినందుకు అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీమంత్రి సాకే శైలజనాథ్, నార్పల సత్యనారాయణరెడ్డికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురం.
Succession O.P. No:05/2025
Between:
జె.నిరంజన్ కుమార్ ...వాది
మరియు
–నిల్– ...ప్రతివాదులు
బహిరంగ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమగనా, పై తెలిపిన వాది మతం హైమావతి ముద్దినాయనపల్లి గ్రామం, కళ్యాణదుర్గం మండలం, అనంతపురం జిల్లా వారి వారసుడిగా ప్రకటించి, ఆమెకు సంబంధించిన మొత్తం రూ.50.000/– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కళ్యాణదుర్గం బ్రాంచి నందు తీసుకొనుటకు గాను పై కేసును దాఖలు చేసినారు. కావున ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-05-2025 నాడు ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనంతట పై కేసు వాదిపరంగ తీర్మానించబడును అని తెలియజేయబడును.
వాయిదా: 06-05-2025
ఇట్లు
శ్రీ సి.పి.గౌడ్,
వాదిపరం న్యాయవాది, అనంతపురం.

'కిశోరి వికాసం' బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-శింగనమల


శింగనమలలో కిశోర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కిషోర బాలికలు ఒకరికొకరు పరిచయం చేసుకోవడం, వారి లక్ష్యాలను వివరించారు. వీటితోపాటు పోషకాహారం, ఆరోగ్యం, రుతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, హక్కులు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వృత్తివిద్య, పోక్సో చట్టం, జీవనోపాధి, డయల్ 100, 1098, 112, వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, ఉమాదేవి, డిసిపియు యూనిట్ సోషల్ వర్కర్ వసంత లక్ష్మి, మహిళా పోలీస్ శిల్ప, ఏఎన్ఎం శైలజ, ఆశాలు వెంకటమ్మ, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు, భారతి, ప్రమీలమ్మ, రామాంజనమ్మ, రుషింగమ్మ, లక్ష్మీదేవి, ఆయాలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని పామిడి సెక్టార్, ఎద్దులపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ అధ్యక్షతన కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదన్నారు. 18ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్‌స్టేషన్లో గానీ, ఐసిడిఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మదీనా ఏరియా -1 సచివాలయ అడ్మిన్ నాగరాజు, అంగన్వాడీ టీచర్లు జయంతి, నారాయణమ్మ, సేకున్‌బి, రెహనా, సాఫియా, రాధా, యశోద, భారతి, గోవిందమ్మ, రజని, అనిత, మహిళా పోలీసులు లక్ష్మీ, శిల్ప, రాధా, ఎఎన్ఎంలు వాణి, కుమారి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : పట్టణంలోని నందలపాడు అంగన్వాడీ సెంటర్లలో కిశోర వికాసంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సాజిదాబేగం మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసంలో అందించే చేయూత పునాది వేస్తుందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు చేసుకోకూడదన్నారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, జిఎంఎస్‌కె అధికారులు, విఒలు, ఆర్పీలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని పుట్లూరు–3వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సిడిపిఒ ఎం.భారతి పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, విద్య, ఆరోగ్యం ఆడపిల్లల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌పై వివరించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శాంతమ్మ, ఎంఇఒ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, జిఎంఎస్‌కె రాధ, ఎఎస్ఐ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : కిశోరి వికాసంపై శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ధనలక్ష్మి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, సోషల్ వర్కర్ వెంకట్, సూపర్‌వైజర్ నాగరత్న, హేమలత, ఎంఎస్‌కె శైలజ, రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ అరునా, విజయ, లక్ష్మి, భరతి, సావిత్రి, ముత్యాలమ్మ, ఆశా, ఎజి బాలికలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిషోర్ బాలికలు వేసవి సెలవులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, కిషోర్ బాలికలు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : ఐసిడిఎస్ సురేఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికల విద్య ప్రాముఖ్యత, రుతుస్రావ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శనం, బాల్య వివాహాల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ, సర్పంచు సాలిబాయి, పంచాయతీ కార్యదర్శి శివరంజని, జిఎంఎస్‌కెలు భాగ్యలక్ష్మి, వాహీద, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కిశోరి వికాసంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిడిపిఒ శ్రీదేవి కోరారు. శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్, ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామాలలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఒ యల్లమ్మ, సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్వాడీలు విజయ, హేమలత, రాజమ్మ, నిర్మల, లక్ష్మి, వనితాదేవి, సర్పంచు శివమ్మ, ఏఎన్ఎం పద్మావతి, అంగన్వాడీ కార్యకర్తలు అన్నపూర్ణమ్మ, జయమ్మ, సుజాత, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలంలో మాట్లాడుతున్న వక్తలు

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆదేశాల మేరకు కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునాలి, టీబీ, హెచ్ఐవి విభాగం జోనల్ సూపర్‌వైజర్ శ్రీరాములు, సిఎల్‌డబ్ల్యు మారుతీప్రసాద్, అంగన్వాడీలు రామాంజినమ్మ, రాధమ్మ, నాగలక్ష్మి, కిషోర్, బాలికలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పశుగ్రాసం ట్రాక్టర్ దగ్ధం

పెద్దవడుగూరు : మండలంలోని తెలికి గ్రామంలో విద్యుత్తు తీగలు తగిలి శుక్రవారం పశుగ్రాసం ట్రాక్టర్ దగ్ధమైంది. రైతు రంగనాథకు చెందిన పశుగ్రాసం కల్లూరు నుంచి ఇంటికి ట్రాక్టరులో తీసుకొస్తున్న తరుణంలో తెలికి గ్రామంలోకి రాగానే విద్యుత్తు తీగలు తగలడంతో నిప్పు చెలరేగింది. దీంతో ట్రాక్టర్ డ్రైవరు ముందు జాగ్రత్తగా ట్రాక్టరులో గ్రాసానికి మంటలు ఎగిసిపడుతుండటంతో గ్రాసాన్ని అక్కడే వదిలివేశారు. గ్రామస్థుల మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశాయగా పూర్తిస్థాయిలో దగ్ధమైంది. దీంతో సుమారు రూ.20వేలు దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రంగనాథ వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన వారు కారు లో వెళుతుండగా అది అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో శశికళ, రత్నమ్మ, ఇందుశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న కారు ను పోలీసులు క్రేన్ సాయంతో పక్కకు తొలగించి వాహనాల రాకపోకలు కొనసాగేలా చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.